ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY


ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం
- ఇళ్ల నిర్మాణంలో జిల్లా మూడోస్థానం
- పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్క


కొత్తగూడలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

కొత్తగూడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయమని అందులో భాగంగానే ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ఇస్తున్నామని, దేశంలో తెలంగాణలో మాత్రమే సన్నబియ్యం ఇస్తున్నామని పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో మహబూబాబాద్ జిల్లా 3స్థానంలో ఉందని పేర్కొన్నారు. కొత్తగూడ మండలంలో శుక్రవారం మంత్రి సీతక్క పర్యటించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు 649 నూతన రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవంలో మంత్రి సీతక్క మొక్కను నాటారు. బూరుగు గుంపులో సబ్ సెంటర్‌ను, మొండ్రాయి గూడెంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని, ఓటాయి పొగుళ్లపల్లి మధ్య నిర్మించిన వంతెనను మంత్రి సీతక్క ప్రారంభించారు. ఓటాయిలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. రైతువేదికలో నిర్వహించిన సమావేశంలో (మిగతా 8లో..)

కలెక్టర్‌కు సిల్వర్ మెడల్

- పరిపాలనలో ఉత్తమ సేవలు అందించినందుకు అవార్డు
- నేడు గవర్నర్ చేతుల మీదుగా అందజేత



మహబూబాబాద్, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పరిపాలనా పరంగా ఉత్తమ సేవలందించిన కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు సిల్వర్ మెడల్ అందించనున్నారు. 2024 సంవత్సరంలో జూలై, ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో నిర్వహించిన సంపూర్ణ అభియాన్ కార్యక్రమంలో మొదటి త్రైమాసికంలో ఏఎన్‌సీ కోసం వందశాతం గర్భిణీల నమోదు, డయాబెటిస్ వందశాతం పరీక్షలు, వందశాతం ఐసీడీఎస్ కార్యక్రమాల నిర్వహణ, స్వయం సహాయక సంఘాలకు లక్ష్యానికి మించి బ్యాంకు లింకేజీ రుణాలు అందించడం, ఏజెన్సీ గంగారం మండలం ఆరు పారా మీటర్లలో ఉత్తమ ప్రతిభ కనపర్చినందుకు గాను రాష్ట్రస్థాయిలో నీతి అయోగ్ సంస్థ జిల్లా కలెక్టర్‌కు సిల్వర్ మెడల్ ప్రకటించింది. హైదరాబాద్ రాజ్‌భవన్‌లోని ప్రజాదర్బార్‌లో శనివారం సంపూర్ణ సమ్మాన్ సమరోహ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి అవార్డుల ప్రధానోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అవార్డును అందుకోనున్నారు.

ఇక ప్రీ ప్రైమరీ

ప్రభుత్వ బడుల్లో ఎల్‌కేజీ, యూకేజీ విద్య

- జిల్లా వ్యాప్తంగా 24 ఎంపీపీఎస్‌ల ఏర్పాటు
- ఆగస్టు 15 నుంచి తరగతుల ప్రారంభానికి కసరత్తు
- ఏర్పాట్లు చేస్తున్న సంబంధిత అధికారులు



తొర్రూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బడుల్లో ప్రీ ప్రైమరీ విద్యను ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి సంబంధించి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో (ఎల్‌కేజీ, యూకేజీ) బోధించనున్నారు. ఇందుకోసం జిల్లాలోని 24 మండల పరిషత్, ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేశారు. ప్రతీ ఏటా ఆన్‌లైన్ నమోదు చేసి యూడైస్ వివరాల ఆధారంగా ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణకు పాఠశాల ఎంపిక జరిగింది. జీరో ఎన్‌రోల్‌మెంట్ వంటి అంశాలే ప్రమాణికంగా ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణకు ఎంపిక చేసినట్లు తెలుస్తుంది.

ప్రభుత్వ బడుల్లో ప్రీ ప్రైమరీ విధానం లేకపోవడంతో ప్రైవేటు వైపు వెళ్తున్నారనే ఆలోచనతో ప్రభుత్వం ఈ విధానానికి శ్రీకారం చుట్టింది. వచ్చే విద్యా సంవత్సరానికి 1వ తరగతిలో ప్రవేశించేందుకు అర్హత కలిగిన చిన్నారులకు ప్రీ ప్రైమరీకి ఎంపిక చేయనున్నారు. ఈ పాఠశాలలను ఆగస్టు 15వ తేదీ నుంచి ప్రారంభించేందుకు విద్యాశాఖ అధికారులు లాంఛనంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలో ఎంపికైన పాఠశాలలు

జిల్లాలలో మండల ప్రాథమిక పరిషత్ పాఠశాలలు (ఎంపీపీఎస్) ఏర్పాటు కానున్నాయి. ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణకు 24 స్కూళ్లను ఎంపిక చేశారు. వాటిలో జమాండ్లపల్లి, సంద్రగూడెం, గున్నెపల్లి, నడివాడ, అయోధ్యపురం, వెంకటాపురం, కాంపెల్లి, బోడ్యతండా, చిన్నకిష్టాపురం, పెద్దకిష్టాపురం, వెలికట్టె, స్టేషన్ గుండ్రాతిమడుగు, జంగిలిగొండ, పాండెం, తాళ్లసంకీస, బోడగుట్ట తండ, దొరవారి వెంపల్లి, పడమటి గూడెం, గడ్డి గూడెం, అమ్మాపురం, డీఎస్‌టీ హరిదాస్ తండా, లక్ష్మీపురం, శాస్త్రినగర్, తానంచర్ల పాఠశాలలున్నాయి.

టీచర్, ఆయాల నియామకం

ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణ కోసం ఎంపికైన పాఠశాలల్లో టీచర్, ఆయాలను నియమించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఎంపిక ప్రక్రియ కలెక్టర్ ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. అదే గ్రామానికి చెందిన ఇంటర్, ఆపై తరగతి చదివిన వారు స్థానికంగా ఉండాలనే నిబంధన విధించారు. ఆయా పోస్టుకు 7వ తరగతి చదవాలని, ఆగస్టు 15వ తేదీలోపు వీరి నియామకాన్ని పూర్తి చేయనున్నట్లు తెలిసింది. ఎంపికైన పాఠశాల ప్రధానోపాధ్యాయులు అందరితో వారం రోజుల్లో డీఈవో, కలెక్టర్ సమక్షంలో సమావేశం నిర్వహించనున్నారు.

భవనాల సుందరీకరణకు నిధులు

ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణకు ఎంపిక చేసిన ప్రాథమిక పాఠశాలల్లో ఓ గదిని ప్రత్యేకంగా కేటాయించనున్నారు. ఆ గది మరమ్మతులను పూర్తిచేసి రంగులు, వివిధ బొమ్మలతో పెయింటింగ్ ఏర్పాటు చేసి సుందరీకరణ కోసం రూ.లక్ష 50వేల నిధులు కేటాయించనున్నట్లు తెలుస్తుంది. ఈ నిధులను ఆయా పాఠశాలల్లో ఇప్పటికే ఏర్పాటైన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా ఖర్చు చేయనున్నారు. తరగతుల కోసం వచ్చే చిన్నారులకు మధ్యాహ్న భోజనాన్ని ఆయా పాఠశాలలు, సాయంత్రం స్నాక్స్ అంగన్‌వాడీలు సమకూరుస్తారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు

మహంకాళి బుచ్చయ్య, ఎంఈవో, తొర్రూరు మండలం



ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణకు పాఠశాలలు ఎంపిక చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం తీసుకువస్తున్న సంస్కరణలను స్వాగతిస్తున్నాం. వీలైనంతమేరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టి చిన్నారులను తరగతుల్లో చేర్పిస్తాం. ఆగస్టు 15 నుంచి తరగతులు ప్రారంభించేందుకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

శ్యామ్ పాటకు పట్టం



- 'బలగం' సినిమాలోని 'ఊరూ.. పల్లెటూరు..' పాటకు పురస్కారం
- జాతీయ స్థాయి సినీ అవార్డుల్లో ఉత్తమ గేయంగా ఎంపిక
- 22 ఏళ్లుగా సినీ పరిశ్రమలో తనదైన ముద్ర
- ఎన్నో హిట్‌పాటల రచయితగా గుర్తింపు

8

రేవంత్‌రెడ్డి డమ్మీ సీఎం

- ఢిల్లీ వెళ్లుడు.. కాంగ్రెస్ పెద్దల కాళ్లు మొక్కుడే ఆయన పని
- తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్నారు
- పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి
- బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ తక్కళ్లపెల్లి రవీందర్‌రావు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తక్కళ్లపెల్లి రవీందర్‌రావు

హనుమకొండ టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేక.. ప్రజలకు ముఖం చూపించలేక సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లుడు.. కాంగ్రెస్ పెద్దల కాళ్ల మొక్కుడు చేస్తున్నాడని ఎమ్మెల్సీ తక్కళ్లపెల్లి రవీందర్‌రావు విమర్శించారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఎమ్మెల్సీ రవీందర్‌రావు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ.. 2023 నవంబరులో బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుపై గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేల అంశంపై సుప్రీంకోర్టు గురువారం కీలక తీర్పునిచ్చిందన్నారు. ఏళ్ల తరబడి ఫిరాయింపు పిటీషన్లు పెండింగ్‌లో ఉంచడం సరికాదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని అత్యున్నత ధర్మాసనం తెలిపిందని అన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలను ప్రజలు ఛీకొడుతున్నారని తెలిపారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచి మరో పార్టీలో చేరిన ఎమ్మెల్యేల సభ్యత్వం వెంటనే రద్దు అయ్యేలా చట్టాన్ని మార్చాలని కోరారు.

ప్రజలు నమ్మి కాంగ్రెస్‌ను గెలిపిస్తే ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని రవీందర్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ చేతుల్లోనే కాంగ్రెస్ పార్టీ రిమోట్ కంట్రోల్‌గా మారిందని అన్నారు. తెలంగాణలో మీనాక్షి నటరాజన్ రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్నారని, సెక్రటేరియేట్‌లో ప్రభుత్వ అధికార యంత్రాంగంతో సమీక్షలు జరపడానికి ఆమె ఎవరు అని ప్రశ్నించారు. సంగారెడ్డి ఫ్యాక్టరీ అగ్నిప్రమాదం ఘటనలో మంత్రులతో సమీక్ష చేయడంపై మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి డమ్మీ సీఎం అని లీడర్‌కు, క్యాడర్‌కు ఎప్పుడో తెలిసిపోయిందని అన్నారు. రేవంత్‌ను పక్కకు బెట్టి మీనాక్షినటరాజన్ తెలంగాణలో పాదయాత్రలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసంచేసి అమలు చేయలేక చేతులెత్తేసిన కాంగ్రెస్‌పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో తప్పకుండా బుద్ధి చెబుతారని అన్నారు.

ఈ కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జనార్దన్‌గౌడ్, పులి రజినీకాంత్, బుద్దె వెంకన్న, కోడెపాక దేవమ్మ, పోలెపల్లి రాంమూర్తి, వీరేందర్, నయీమొద్దీన్, మహేందర్, మూటిక రాజు, రమేష్, శ్రీకాంతాచారి, సతీష్, గౌస్‌ఖాన్, రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీసీలను మోసగిస్తున్న బీజేపీ సర్కార్

- స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు నాగయ్య



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు నాగయ్య

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వారిని మోసగించే విధంగా ప్రయత్నిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జి.నాగయ్య విమర్శించారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో శుక్రవారం సీపీఎం జిల్లాస్థాయి వర్క్‌షాప్‌ను జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించి, గవర్నర్ ద్వారా కేంద్రానికి పంపిన బిల్లును బీజేపీ ప్రభుత్వం ఆమోదించకుండా కాలయాపన చేయడంతో బీసీల పట్ల వారికున్న ప్రేమ ఏంటో అర్థమవుతుందన్నారు. రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్రమంత్రులు ప్రగల్భాలు పలకడం మాని బీసీ రిజర్వేషన్ సాధనకై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం తాము పోరాడుతామని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. నిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతున్న సీపీఎంను ప్రజలు ఆదరించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శివర్గసభ్యులు గునిగంటి రాజన్న, అల్వాల వీరయ్య, ఆకుల రాజు, కుంట ఉపేందర్, కందునూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.



నేరడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ముఖగుర్తింపు హాజరు వేసుకుంటున్న ఉపాధ్యాయుడు శివప్రసాద్

మొదటి రోజు ముఖగుర్తింపు హాజరు

63.85 శాతం

రిజిస్టర్ అయిన టీచర్లు 2,393, రిజిస్టర్ కానీ ఉపాధ్యాయులు 1,466

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తొలిరోజు శుక్రవారం ప్రభుత్వ బడుల్లో ప్రారంభమైన ఫేషియల్ అటెండెన్స్‌లో 63.85 శాతం హాజరున మోదైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, మోడల్ స్కూల్స్ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు 935 ఉండగా ఇందులో విద్యార్థులు లేని పాఠశాలలు 167 ఉన్నాయి. జిల్లాలో ప్రస్తుతం 768 పాఠశాలల నిర్వహణ జరుగుతుండగా వాటిల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లు, అన్ని సబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్లు, తెలుగు, హిందీ పండిట్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు 3,604 మంది, బోధనేతర సిబ్బంది 255 మంది మొత్తం 3,859 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఫేషియల్ అటెండెన్స్‌లో 2,393 మంది ఉపాధ్యాయులు రిజిస్టర్ కాగా, 2,464 మంది హాజరైనట్లుగా నమోదైంది. ఇందులో 1,466 మంది ఉపాధ్యాయులు పాఠశాలలకు హాజరైనప్పటికీ సాంకేతిక సమస్యల వలన రిజిస్టర్ కాలేదు. జిల్లా వ్యాప్తంగా 14 మంది గైర్హాజరు కాగా, 4 గురు ఉపాధ్యాయులు మాత్రం సెలవులో ఉన్నట్లు విద్యాశాఖాధికారులు పేర్కొన్నారు. జిల్లాలో 18 మండలాల్లో కురవి మండలం అత్యధికంగా 72.47 శాతం మంది ఉపాధ్యాయుల ఫేషియల్ అటెండెన్స్‌లో నమోదు కాగా అత్యల్పంగా దంతాలపల్లి మండలం 53.57శాతం హాజరు నమోదైనట్లు పేర్కొన్నారు.

ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

- జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల

8

అమృత్ భారత్ పనులను పూర్తి చేయండి


- రైలు ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించండి
- సికింద్రాబాద్ డీఆర్ఎం గోపాలకృష్ణన్
- సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే మురళీనాయక్, మాజీ వైస్‌చైర్మన్ ఫరీద్ విజ్ఞప్తి


మానుకోట రైల్వేస్టేషన్ సందర్శిస్తున్న దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం గోపాలకృష్ణన్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్, డోర్నకల్ రైల్వేస్టేషన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ గోపాలకృష్ణన్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అమృత్‌భారత్ కింద మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో జాప్యం ఏర్పడుతోందని స్థానిక శాసనసభ్యులు భూక్య మురళీనాయక్‌తోపాటు మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎండీ.ఫరీద్, సీనియర్ సిటిజన్లు, స్థానికులు డీఆర్ఎంకు ఫిర్యాదు చేశారు. దీంతో సానుకూలంగా స్పందించిన డీఆర్ఎం గోపాలకృష్ణన్ అమృత్ భారత్ పనులను షెడ్యూల్ ప్రకారం నిర్ణీత గడువులోగా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ప్రయాణికులకు త్వరితగతిన సౌకర్యాలను అందించాలని చెప్పారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ రైల్వే డీఆర్ఎంతో మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌లో మౌళిక వసతులు, రైల్వే వర్క్‌షాప్‌తోపాటు గ్రాండ్ ట్రంక్ (జీటీ), ఏపీ, తమిళనాడు, వందేభారత్, ఎల్‌టీటీ, గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌లను ఆపాలని వినతిపత్రాన్ని అందజేశారు. అదే క్రమంలో మహబూబాబాద్ మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్ కూడా డీఆర్ఎంను కలిసి మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో నా లుగో నెంబరు ప్లాట్‌ఫాం నిర్మాణం తక్షణమే (మిగతా 8లో..)

మునిసిపల్ ఎన్నికలకు కసరత్తు

- హైకోర్టు ఆదేశంతో కదలిక
- అధికారులకు అందిన ఆదేశాలు
- ఓటర్ల జాబితా తయారీపై దృష్టి
- ఉమ్మడి జిల్లాలో మొత్తం 12 పురపాలక సంఘాలు

హనుమకొండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వం.. మరో పక్క పురపాలక సంఘాలకు కూడా ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు పురపాలక సంఘాల అధికారులకు సంకేతాలను ఇచ్చింది. ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లను మొదలు పెట్టవలసిందిగా సూత్రప్రాయంగా ఆదేశాలిచ్చింది. ప్రభుత్వ సూచన మేరకు అధికారులు కసరత్తు మొదలు పెడుతున్నారు. రాష్ట్రంలో పురపాలక సంస్థలకు ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారని హైకోర్టు రాష్ట్రప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఇప్పటివరకు ఎన్నికలు ఎందుకు నిర్వహించలేదని నిలదీసింది. ఎప్పటిలోగా నిర్వహిస్తారో చెప్పాలని ఆదేశించింది. కాలపరిమితి పూర్తయినప్పటికీ ఇంకా ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించింది. ఈ అంశంపై సమగ్ర వివరాలు అందించాలని ఆదేశించింది. ఈ ఏడాది మార్చి 25న నిర్మల్ మున్సిపాలిటీ పాలక వర్గం కాలపరిమితి ముగిసినప్పటికీ అక్కడ ఎన్నికలు నిర్వహించడం లేదని ఒక పౌరుడు హైకోర్టును ఆశ్రయించడంతో (మిగతా 8లో..)



తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న మద్యం, వస్తువులను చూపుతున్న పోలీసులు

పోలీసుల విస్తృత తనిఖీలు

అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం స్వాధీనం

తొర్రూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తొర్రూరు పట్టణ కేంద్రంలోని పలు వార్డుల్లో పోలీసులు విస్తృత తనిఖీలు (కార్డన్ సెర్చ్) నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం, అనుమతిలేని వాహనాలు, గుడుంబా, నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నట్లు తొర్రూరు సీఐ గణేశ్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సాయినగర్, రాజీవ్‌నగర్, అంబేడ్కర్ నగర్ ఏరియాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించగా అనుమతిలేని, నంబర్ ప్లేట్‌లు లేని 20 ద్విచక్ర వాహనాలు, రూ.10వేల అక్రమ మద్యం, 10 లీటర్ల గుడుంబా, 40 లీటర్ల బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం అక్రమంగా నిల్వ చేసినా, గుడుంబా విక్రయించినా చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ఉపేందర్, రమేశ్, క్రాంతి, శివ, అంజమ్మ, సిబ్బంది ఉన్నారు.

క్రిమిసంహారక మందు తాగి వ్యక్తి మృతి

ఇనుగుర్తి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి మండలం చీన్యాతండా గ్రామ పంచాయతీ పరిధి ఐలయ్యబావితండాలో భూక్య హర్ల(55) క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కేసముద్రం ట్రైనీ ఎస్ఐ నరేశ్ శుక్రవారం తెలిపారు. హర్ల కొద్దిరోజులుగా మతిస్థిమితం సరిగా లేకుండా ఉన్నాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఇంట్లోంచి బయటకు వెళ్లి క్రిమిసంహారక మందు తాగాడు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు ఆయన్ను 108లో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ అర్ధరాత్రి ప్రాంతంలో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్ల సంతానం. మృతుని కుమారుడు నరేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ట్రైనీ ఎస్ఐ నరేశ్ తెలిపారు.

102 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు

కాటారం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కాటారం డివిజన్ పరిధిలోని కాటారం, మల్హర్‌రావు, మహాముత్తారం, మహదేవపూర్, పలిమెల మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన 102 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. అనారోగ్యం, ప్రమదాల బారిన పడిన పలువురు ఆస్పత్రిలో చికిత్స తీసుకుని ఆర్థిక సాయం కోసం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును సంప్రదించగా ఆయన సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం మంజూరు చేయించినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. 102 మంది లబ్ధిదారులకు రూ.35.01లక్షల విలువైన చెక్కులు రాగా పంపిణీ చేయనున్నట్లు మంత్రి క్యాంపు కార్యాలయ అధికారులు వెల్లడించారు. కాటారం మండలంలో 27, మల్హర్‌రావు మండలం 35, మహాముత్తారం మండలం 20, మహదేవపూర్ మండలం 18, పలిమెల మండలంలో 2 చెక్కులు మంజూరు అయ్యాయి.

ఒక మార్పు అభివృద్ధికి మలుపు

ఫోటోలకు ఫోజులతో పనులు కావు

సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ నారాయణ రావు

తొర్రూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఒక మార్పు అభివృద్ధికి మలుపు అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా శుక్రవారం సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ నారాయణ రావు తొర్రూరు మునిసిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 100 రోజుల యాక్షన్ ప్లాన్ అన్ని మునిసిపాలిటీల్లో విజయవంతంగా కొనసాగుతోందని, తొర్రూరులో క్లీన్ అండ్ గ్రీన్ పబ్లిసిటీ, పార్కుల డెవలప్‌మెంట్, సీజనల్ వ్యాధుల నివారణకు అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ఫోటోలకు ఫోజులతో పనులు కావని, పనులు చేస్తుంటే అభివృద్ధి జరుగుతుందని, ప్రతీ రోజు ఒక కార్యక్రమాన్ని చేపడితే ప్రజల నుంచి మద్దతు లభిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ శ్యాంసుందర్, మేనేజర్ కట్టస్వామి, ఏఈ రంజిత్, వార్డు సిబ్బంది తదితరులు ఉన్నారు.

మూడు నెలలలోపే పనుల పూర్తి కావాలి

మరిపెడ: మరిపెడ మునిసిపాలిటీలో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన అమృత్ వర్క్సను గుత్తేదారులు మూడు నెలలలోపే పూర్తి చేయాలని రాష్ట్ర కమిషనర్ ఆఫ్ డెవలప్‌మెంట్ మునిసిపల్ అడ్మిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ నారాయణరావు మునిసిపల్ ఇంజినీర్లను ఆదేశించారు. శుక్రవారం ఆయన మరిపెడ మునిసిపల్ కేంద్రంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సివిల్ సప్లయి గోదాం దగ్గర నిర్మితమవుతున్న ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ పనులను పరిశీలించారు. మునిసిపల్ ఆఫీస్‌లోని పలు రికార్డులను తనిఖీ చేశారు. మునిసిపల్, సిబ్బంది, మెప్మా సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించగా అక్కడి వెళ్లి ఆయన వారితో మాట్లాడారు. డంపింగ్ యార్డు, నిలిచి పోయిన మోడల్ మార్కెట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ ఇంజినీర్లకు పలు సలహాలు, సూచనలు చేశారు. మునిసిపల్ కమిషనర్ విజయానంద్, డీఈఈ నవీన్, ఏఈ శృతి, మేనేజర్ శ్రీనివాస్, మునిసిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



తొర్రూరులో సిబ్బందికి సూచనలు చేస్తున్న నారాయణరావు

అవాకులు.. చెవాకులు మానుకో..

● రాష్ట్ర మాజీ మంత్రి సత్యవతిరాథోడ్

డోర్నకల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్ అవాకులు.. చెవాకులు మానుకోవాలని మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. మన్నేగూడెంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్‌లో తన ప్రాధాన్యత గురించి రాంచందర్‌నాయక్ అవాకులు పెల్బుతున్నాడని అన్నారు. తన స్థాయి ఏమిటో రాష్ట్ర, జిల్లా ప్రజలకు తెలుసనని ఆమె పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో లంబాడ సామాజికవర్గానికి రాష్ట్ర మంత్రి మండలిలో కాంగ్రెస్ చోటు కల్పించలేదన్నారు. లంబాడలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావ్ పదే.. పదే ప్రకటిస్తున్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ నుంచి కనీసం ఖండన ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రంలో సమస్యలన్నీ ఎక్కడివి.. అక్కడే ఉన్నాయని, వారి పరిష్కారానికి కాంగ్రెస్ నాయకులు కనీసం చొరవ కూడా చూపడం లేదన్నారు. ఆరు గ్యారెంటీల అమలులో సైతం విఫలం చెందారని చెప్పారు.



మన్నేగూడెంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సత్యవతిరాథోడ్

ఈ సమావేశంలో కొండపల్లి సీతారాం రెడ్డి, విజయపాల్‌రెడ్డి, సురేష్‌పాట్నీ, ముత్తయ్య, వెంకన్న, రాంబాబు, ఉపేందర్‌లు పాల్గొన్నారు.

పారా ఒలంపిక్స్‌లో తెలంగాణకు పతకాల పంట

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మలేషియాలో జరిగిన 10వ పారా ఒలంపిక్స్‌లో తెలంగాణ రాష్ట్రానికి పతకాల పంట పండింది. జూలై 25 నుంచి ఆగస్టు 1వరకు మలేషియా దేశంలోని కూచింగ్‌లో జరిగిన 10వ ఆసియా తైక్వాండో పూమ్సే, క్యూరోగి పారా ఒలంపిక్స్‌లో భారత్ నుంచి ముగ్గురు క్రీడాకారులు పాల్గొని పతకాలు సాధించారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఎల్లావుల గౌతం యాదవ్ (సిల్వర్ మెడల్) కుక్కల శివ (సిల్వర్ మెడల్) ఎం.కృష్ణవాణి (బ్రాంజ్ మెడల్)లు సాధించారు. భారత్ తైక్వాండో టీమ్‌కు ఎల్లావుల గణేష్ యాదవ్ కోచ్‌గా వ్యవహరించారు. భారత్‌కు పతకాలు సాధించిన క్రీడాకారులను దేశంలోని పలువురు సీనియర్ క్రీడాకారులు, కోచ్‌లు అభినందించారు.

చర్లపల్లి - పాట్నా వీక్లీ స్పెషల్ రైలు పొడిగింపు

కాజీపేట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : రైల్వే ప్రయాణికుల రద్దీ దృష్ట్యా చర్లపల్లి - పాట్నా మధ్య నడిచే స్పెషల్ వీక్లీ రైళ్లను పొడిగించి (స్టేషన్ల సంఖ్య పెంపు) నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. (03253) పాట్నా - చర్లపల్లి మధ్య నడిచే వీక్లీ స్పెషల్ రైలు సోమ, బుధవారాల్లో ఈ నెల 4 నుంచి 29 వరకు జహనాబాద్ వరకు పొడిగించి నడిపిస్తున్నట్లు చెప్పారు. (07255) చర్లపల్లి - పాట్నా మధ్య నడిచే వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రతీ బుధవారాల్లో ఈ నెల 6 నుంచి సెప్టెంబరు 1 వరకు పొడగించి నడిపించనున్నారు. (07256) చర్లపల్లి - పాట్నా మధ్య ప్రతీ శుక్రవారం నడిచే ఈ వీక్లి స్పెషల్ రైలు ఈ నెల 8 నుంచి 26 వరకు పొడిగించి నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు చెప్పారు. ఈ రైలు సికింద్రాబాద్, కాజీపేట, పెద్దపల్లి, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్లార్షా నాగపూర్, గోండియా, దర్గ్, రాయ్‌పూర్, బిలాస్‌పూర్, జార్సీగూడ, రౌర్కెలా, హాతియా, రాంచి, బొకారో, గోమో, కొడెర్మా, జయా, జెహనాబాద్, రైల్వేస్టేషన్‌లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ఆరోగ్యం-విద్యపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో

చిన్నగూడూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆరోగ్యం, విద్యార్థుల విద్యపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో అన్నారు. శుక్రవారం ఉగ్గంపల్లి పీహెచ్‌సీ, చిన్నగూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేసి, రికార్డులను, క్షేత్రస్థాయి ఆరోగ్య సర్వే, నివేదికలను తనిఖీ చేసి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సాధారణ ప్రసవాలను పోత్సహించాలని మాత, శిశు మరణాలు జరగకుండా చర్యలు తీసుకొవాలని ఆరోగ్యానికి సంబంధిచిన ప్రతీ కార్యక్రమం షెడ్యూలు ప్రకారం నిర్వహించాలని సూచించారు. అనంతరం చిన్నగూడూరు ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న విద్య, ఆహారం తదితర అంశాలను ఆరా తీశారు. విద్యార్థుల హాజరు శాతానికి అనుగుణంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రభుత్వ విద్యాసంస్థలో చదువుతున్న విద్యార్థులకు హెల్త్ ఎడ్యుకేషన్, న్యూట్రిషన్‌లపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తుందని, అందులో భాగంగానే జిల్లాలో ప్రత్యేక అధికారులను నియమించి నివేదికలను కోరుతామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంపత్, ఎంపీడీవో కిన్నెర యాకయ్య, ఎంపీవో రజిని తదితరులు పాల్గొన్నారు.



చిన్నగూడూరులో భోజనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్



మోడల్ స్కూల్ హాస్టల్‌లో విద్యార్థినుల సమస్యలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర దంపతులు

సమస్యలతో విద్యార్థినుల సతమతం

హాస్టళ్లలో సౌకర్యాలపై శ్రద్ధ చూపాలి

మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

చిట్యాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): హాస్టళ్లలోని విద్యార్థినులు సమస్యలతో సతమతం అవుతున్నారని, వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం దృష్టి సారించాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతివెంకటరమణారెడ్డి దంపతులు మండలంలోని కేజీబీవీ, మోడల్ స్కూల్ వసతి గృహాన్ని శుక్రవారం సందర్శించారు. విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆయా వసతి గృహాల్లోని సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వసతి గృహాల్లో పారిశుధ్య లోపాలున్నాయని, పిచ్చిమొక్కలతో దోమల బెడద ఎక్కువగా ఉందన్నారు. వర్షాకాలం, రానున్న చలికాలం దృష్ట్యా హాస్టళ్లలో సోలార్ వాటర్ హీటర్లు, సోలార్ లైట్లు, మెస్‌డోర్లు వెంటనే ఏర్పాటు చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులు చదువుకోవడానికి స్టడీ రూంలు, ఆడుకోవడానికి క్రీడా మైదానాలు లేవని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న కాస్మెటిక్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో చదువుకునేలా చూడాలన్నారు.

లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్, పీఏసీఎస్ చైర్మన్ క్రాంతికుమార్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేష్, మండల ప్రధాన కార్యదర్శి ఏరుకొండ రాజేందర్, నాయకులు పాండ్రాల వీరస్వామి, పెరుమాండ్ల రవీందర్, దామెర రాజు, రమణాచారి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి వాస్తవ లాభాలను ప్రకటించాలి

బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పాని శ్రీనివాస్

కృష్ణకాలనీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సింగరేణి వాస్తవ లాభాలను ప్రకటించాలని బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పాని శ్రీనివాస్ అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసిందని, ఇప్పటి వరకు కూడా వాస్తవ లాభాలు ప్రకటించకుండా ఆలస్యం చేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు. శుక్రవారం భూపాలపల్లి సింగరేణి ఏరియాలోని కేటీకే 1వ గనిలో కార్మికులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాప్యం లేకుండా వెంటనే ప్రకటించి 40 శాతం వాటాను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం కార్మికులు కష్టపడి రికార్డు స్థాయిలో 70.12 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించారని, రూ.40వేల కోట్లు వ్యాపారం జరిగిందన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం అధికంగా బొగ్గు ఉత్పత్తి సాధ్యమైందని స్పష్టం చేశారు.

ఇక సింగరేణి కారుణ్య నియామకాల్లో కార్మికులకు తీరని అన్యాయం జరుగుతుందని, బోర్డుకు 57 మంది కార్మికులు హాజరైతే కేవ లం ముగ్గురు మాత్రమే ఇన్‌వాలిడేషన్ కావడం విచారకరమన్నారు. మెడికల్ ఇన్‌వాలిడేషన్ పారదర్శకంగా జరగడం లేదని, యాజమాన్యం అనేక విజిలెన్స్ విచారణల పేరుతో కార్మికులకు ఏం న్యాయం చేసిందో సరైన సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రాంచి ఉపాధ్యక్షులు వెలబోయిన సుజేందర్, శ్రీరాములు, రేణికుంట్ల మల్లేష్, రాసకట్ల నరసింహారావు, ర ఘుపతిరెడ్డి, తాండ్ర మొగిళి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలి

వెంకటాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ సొంది వీరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని కొమరంభీం విగ్రహం ఆవరణలో జరిగిన ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ విభజన వల్ల పార్లమెంట్ నియోజకవర్గం మహబూబాబాద్‌కు వెళ్లిపోవడం వల్ల బంజారా సామాజిక వర్గానికి చెందిన వారే ఎంపీలు అవుతున్నారని అన్నారు. భవిష్యత్‌లో ఎప్పుడు కూడా ఆదివాసీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులు పోటీ చేసే అవకాశం కనబడడం లేదని తెలిపారు.

గత ప్రభుత్వం బంజారా సామాజిక వర్గాన్ని ఆకట్టుకునేందుకు కొత్తగూడెం కేంద్రంగా మెడికల్ కళాశాల ఏర్పాటు చేసిందని, దేశంలో అన్నివర్గాల కంటే ఆదిమ జాతులే వెనుకబడి పోయారని ఐక్యరాజ్య సమితి సైతం స్పష్టం చేసిందని పేర్కొన్నారు. ఆదిమ జాతులు విద్యా రంగంలో ముందుకు సాగేందుకు భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల మంజూరు చేసినట్లయితే భవిష్యత్ తరాలు అభివృద్ధి చెందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. లేనట్లయితే ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి, జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకులు ఉయిక శంకర్, ఆదివాసీ నవనిర్మాణ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్సా నర్సింహమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ వాసం నాగరాజు, నాయకులు కుంజ మహేష్, చింత సమ్మయ్య, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి రవి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నర్సింహులపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి సెంటర్‌కు వచ్చే రోగులకు త్వరితగతిన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రవి రాథోడ్ అన్నారు. శుక్రవారం మండలం కేంద్రంలోని హెల్త్ సబ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. రోగులకు అందుబాటులో ఉంటూ మందులు పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పలు రికార్డులు రిజిష్టర్లను పరిశీలించారు. అలాగే సబ్ సెంటర్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ జరుపుల అవినాష్, ఏఎన్ఎంలు ప్రసన్నకుమారి, కృష్ణవేణి, ఆశ కార్యకర్త జ్యోతి పాల్గొన్నారు.



తూము ద్వారా లక్నవరం సరస్సు నీటిని విడుదల చేస్తున్న మంత్రి సీతక్క

రామప్ప నుంచి లక్నవరం వరకు నీటి కాల్వ

రెండు పంటలకు సాగునీరు అందిస్తాం

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

గోవిందరావుపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రైతుల కోసం సాగునీటి వనరుల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. అందులో భాగంగా రామప్ప సరస్సు నుంచి లక్నవరం సరస్సుకు కాల్వ ద్వారా నీటిని అందించడం జరుగుతుందని, రెండు పంటలకు సాగునీరు ఇస్తామని అన్నారు. శుక్రవారం మండలంలోని లక్నవరం సరస్సు నీటిని తూము ద్వారా పంట కాల్వలకు విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రామప్ప నుంచి లక్నవరం వరకు నీటికాల్వను ఏర్పాటు చేస్తామని, దీని ద్వారా రైతులకు ఏడాదిలో రెండు పంటలకు నీరందే అవకాశం ఏర్పడుతుందని అన్నారు. చెరువుల్లో నీరు ఉంటే ఊరు పచ్చగా మారుతుందని, అదే స్ఫూర్తితో రైతులకు నీటి కొరత లేకుండా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని రంగాల్లో కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ టీఎస్.దివాకర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఇరిగేషన్ ఈఈ నారాయణ, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాజీపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. కాజీపేట రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట ఫాతిమా నగర్ రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం మృతి చెంది ఉన్నాడు.. మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్లు. ఎరుపు కోలరంగు ముఖం, ఎత్తు 5.5, ఎడమ చేతిపై శివలింగం, ఢమరుకం శూలం పచ్చబొట్టు ఉంది. ఛాతిపై పుట్టుమచ్చ ఉంది. మృతుడి ఒంటిపై ఎలాంటి చొక్కా లేదు. బ్లూకలర్ జీన్‌ప్యాంట్ ఉంది. మృతుడిని గుర్తించడానికి ఎలాంటి ఆనవాళ్లు లేవు. రైల్వే ప్రయాణికుల సమాచారం మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్ ఫోన్ నంబర్ 87126 58609, 94400 27342 సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు తెలిపారు.

ఆర్ఐలా ? వసూల్ రాజాలా ?

- జీడబ్ల్యూఎంసీలో లంచావతారులు
- పావులుగా మారుతున్న వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు
- ఒక్కో మ్యుటేషన్‌కు రూ.లక్షల్లో వసూళ్లు
- అడిగింది ఇవ్వకపోతే కొర్రీలు
- ఆర్ఐల తీరును పట్టించుకోని అధికారులు



వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ)లో కొందరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు డబ్బులు ఇవ్వనిదే పని చేయరనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు, పాలకవర్గం చూసి చూడనట్టు వ్యవహరిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. 11 మంది ఆర్ఐలలో కొందరు పని చేస్తున్న స్థానంలో మూడు సంవత్సరాలకు మించి పని చేస్తున్నా అదే స్థానంలో స్థిరంగా ఉండేందుకు ప్రజాప్రతినిధులకు డబ్బులిచ్చి మరీ రెన్యువల్ చేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇదంతా బల్దియా ఉన్నతాధికారులు, పాలకవర్గం కనుసన్నల్లోనే వీరు పని చేస్తున్నట్లు బాహాటంగానే చర్చ జరుగుతుంది. గ్రేటర్ పరిధిలో జూనియర్ అసిస్టెంట్ స్థాయిలో కార్యాలయాల్లో పని చేయాల్సిన వీరు అడ్డదారిలో వచ్చే డబ్బులకు రుచి మరిగి యథా స్థానాల్లోనే తిష్ట వేసి అందిన కాడికి దండుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. కొందరు ఆర్ఐలు తక్కువ కాలంలోనే విలాసవంతమైన ఇళ్లు, భారీగా బ్యాంకు బ్యాలెన్స్ కూడబెట్టినట్టు తెలుస్తోంది. బల్దియా కార్యాలయంతో పాటు కాశిబుగ్గ, కాజీపేట సర్కిల్ కార్యాలయాల్లో అర్హత కలిగిన సిబ్బందికి ఆర్ఐలుగా అవకాశం ఇవ్వకుండా ఓ సెక్షన్ అధికారి అక్రమార్కులను ప్రోత్సహిస్తూ గడువు దాటినా ఇంకా కొనసాగించడం వెనుక అంతర్యమేమిటని అనుమానాలు రేకెత్తుతున్నాయి. పాత ఆర్ఐలను తొలగించి కొత్త వారికి అవకాశం ఇవ్వాలని డిమాండ్ వినిపిస్తుంది.

గ్రేటర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లా.. మజాకా

గ్రేటర్ పరిధిలోని 66 డివిజన్లలో ప్రజలు ఆన్‌లైన్‌లో ఇంటి నెంబర్ల జారీ (అసెస్‌మెంట్) పాత మ్యుటేషన్లు, ఇంటి పన్నుల వసూలు, ప్రభుత్వ సర్వేలు నిర్వహించాలి. కానీ వారు నిర్వహించే అన్ని డ్యూటీలను వదిలి అడ్డదారిలో వచ్చే అసెస్‌మెంట్‌పై ఎక్కువ మక్కువ చూపుతున్నట్లు తెలుస్తోంది. కాగా మిగతా డ్యూటీలను కింది స్థాయి బిల్ కలెక్టర్లు, వార్డ్ ఆఫీసర్ల ద్వారా చేయిస్తున్నారు. కొందరు ఆర్ఐలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వారి వద్ద పని చేస్తున్న బిల్ కలెక్టర్లు, కొత్త వార్డు అధికారులను పావులుగా వాడుకుంటూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇటీవల ఇద్దరు ఆర్ఐలు ఫోన్ పే చేయించుకుని ఫిర్యాదుదారులకు అడ్డంగా దొరికిపోయినట్లు తెలిసింది. వరంగల్ విలీన గ్రామాలకు చెందిన ఓ ఆర్ఐ ఓ వ్యక్తి నుంచి రూ. 20 వేలు ఫోన్‌పే చేయించుకుని ఇంటి నెంబర్ ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెట్టినట్టు బాధితులు తెలిపారు. అన్నదమ్ముల ఆస్తుల బైవెరిఫికేషన్ చేసేందుకు ఓ ఆర్ఐ మధ్యవర్తి ద్వారా ఏకంగా రూ. 1 లక్ష డిమాండ్ చేసి రూ. 50 వేలు తీసుకుని పని చేసినట్లు తెలిసింది. ఓ మహిళా ఆర్ఐ పెద్ద మొత్తంలో డబ్బులు దండుకుని ఒకే ఇంటికి రెండు నెంబర్లు జారీ చేసి చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు అధికారులు చుట్టు తిరిగినట్లు తెలిసింది. కొందరు బిల్ కలెక్టర్లు ఆన్‌లైన్ పేమెంట్‌తో పాటు అదనంగా లంచం ఇచ్చిన ఇంటి నెంబర్ ఇస్తున్నట్లు తెలిసింది. పని కోసం లంచం తీసుకుని కొర్రీలు పెడుతుండడంతో కొందరు బాధితులు గ్రేటర్ ప్రజావాణిలో ఫిర్యాదులు చేయడం గమనార్హం. చాలాకాలంగా కొందరు ఆర్ఐలు ప్రభుత్వ ఔట్‌సోర్సింగ్ బిల్ కలెక్టర్లను ఏర్పాటు చేసుకుని అక్రమ సంపాదనకు తెరలేపి కోట్లు కొల్లగొట్టినట్లు సమాచారం. ఇదంతా బల్దియా ఉన్నతాధికారులకు తెలియదా ? అంటే ప్రతీ నెల ఇచ్చే మామూళ్లతో నిద్రమత్తు నటిస్తున్నట్టు ప్రచారం జరుగుతుంది.

అవీ.. ఇవీ లేవంటూ ఆఫీస్ చుట్టూ తిప్పిస్తూ..

వరంగల్ నగర పరిధిలో 11 మంది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పని చేస్తున్నారు. వారి వద్ద డివిజన్ల పరిధిని బట్టి 5 నుంచి 8 మంది బిల్ కలెక్టర్లు, వార్డ్ అధికారులు పని చేస్తున్నారు. ప్రస్తుతం నగరంలో 66 మంది బిల్ కలెక్టర్లు పని చేస్తుండగా ఇటీవల కొత్తగా కార్పొరేషన్‌కు కేటాయించిన గ్రూప్ -4 అధికారులను సైతం వార్డు అధికారులుగా నియమించారు. యజమానుల పేరు మార్పు, బైవెరిఫికేషన్, కొత్త ఇంటి నెంబర్లు, వీఎల్‌టీ (వెకెట్ ల్యాండ్ ట్యాక్స్) తదితర పనులు చేసేందుకు నియమించారు. ఇందుకు ప్రజలు ఆన్‌లైన్ ద్వారా వారికి అవసరం ఉన్న పనిని బట్టి చలానా ద్వారా డబ్బులు చెల్లించి పని కోసం ఎదురు చూస్తుంటారు. కానీ కొందరు ఆర్ఐలు చేయి తడపనిదే పని చేయబోమని మొండికేస్తున్నారు. దరఖాస్తు పత్రాలు సరిగా లేవని కొర్రీలు పెడుతున్నారు. కొందరు ఆర్ఐలు చేతికి మట్టి అంటకుండా బిల్ కలెక్టర్లను రంగంలోకి దింపి దరఖాస్తుదారులకు నేరుగా ఫోన్ చేయిస్తున్నారు. పలానా దరఖాస్తు ప్లాన్‌లో తప్పులున్నాయి.. డాక్యుమెంట్లు సరిగా లేవని, హద్దులు సరిగా లేవని, రోడ్డు వెడల్పు సరిగా లేదని, కుటుంబ సభ్యుల నుంచి ఎన్‌వోసీ తేవాలని ప్రశ్నల వర్షం కురిపిస్తూ దరఖాస్తు రద్దు చేస్తున్నారు. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ఉచిత సలహా ఇస్తున్నారు. ఇలా డబ్బులు ఇచ్చే వరకు పట్టి పీడిస్తున్నారు. పని చేయకుండా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. డబ్బులు ఇస్తాము పని చేయండి బాబోయ్.. అనే వరకు తిప్పుకుంటారు. ఇలా ఇంటి నెంబర్‌కు కనీసం రూ. 50 నుంచి రూ. 1 లక్ష వసూలు చేస్తుండగా మిగతా వాటికి పనిని బట్టి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా ఆరుగురు ఆర్ఐలు ఒకేచోట 10 సంవత్సరాలుగా పాతుకుపోయి అక్రమ వసూళ్ల దందా కొనసాగిస్తూ కోట్లు సంపాదించినట్టు తోటి ఉద్యోగులే ఆరోపిస్తున్నారు.

భూపాలపల్లికి బైపాస్ రోడ్డు

- ఫలించిన ఎంపీ కావ్య కృషి
- వార్షిక ప్రణాళికలో నిధుల కేటాయింపు
- త్వరలో డీపీఆర్, టెండర్ పనులు పూర్తి


కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ కడియం కావ్య (ఫైల్)

హనుమకొండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని భూపాలపల్లి పట్టణానికి బైపాస్ రోడ్డు మంజూరైంది. వరంగల్ ఎంపీ కడియం కావ్య కృషి ఫలించింది. ఈ రోడ్డు విషయమై ఎంపీ పలుమార్లు కేంద్ర రోడ్లు, రవాణా మంత్రి నితిన్ గడ్కరీని కలిసి వినతి పత్రాలు అందజేశారు. భూపాలపల్లి పట్టణంలో ప్రధానంగా భారీ ట్రాఫిక్, బొగ్గు రవాణా, పవర్‌ప్లాంట్ కార్యకలాపాల వల్ల ఎన్‌హెచ్-353సీ పైన వాహనాల రద్దీ పెరగడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, డాక్టర్ కావ్య కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మూడేళ్లలో దాదాపు 233 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. దీన్ని నివారించడానికి భూపాలపల్లి పట్టణాన్ని దాటి వెళ్లే వాహనాల కోసం బైపాస్ రోడ్డు పనులను వెంటనే చేపట్టాలని కోరారు. రూ.250కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బైపాస్ రోడ్డులో రూ.175కోట్లు నిర్మాణ పనులకు, రూ.75కోట్లు భూసేకరణకు వినియోగించాలని, ఈ నిధుల మంజూరును 2025-26 వార్షిక ప్రణాళికలో చేర్చాలని కావ్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్పందించిన కేంద్ర మంత్రి గడ్కరీ ఎన్‌హెచ్-353సీపైన భూపాపల్లి పట్టణానికి బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను 2025-26 వార్షిక ప్రణాళికలో చేర్చినట్టు డాక్టర్ కావ్యకు రాసిన లేఖలో పేర్కొన్నారు. డీపీఆర్‌ను, టెండరు పనులను పూర్తి చేస్తామని డాక్టర్ కావ్యకు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. బైపాస్ రోడ్డు నిర్మాణం వల్ల భూపాలపల్లి పట్టణ ప్రజల సమస్యలు తీరనున్నాయన్నారు.

గానమే ఆమె గమనం

- ఉత్తమ సింగర్‌గా జాతీయస్థాయి అవార్డు
- 2 వేలకు పైగా పాటలు పాడి ప్రజల మెప్పు
- తన గాత్రంతో ఉర్రూతలూగిస్తున్న వాణిశ్రీ
- వృద్ధాశ్రమం నెలకొల్పేందుకు అడుగులు


ఓ ఈవెంట్‌లో పాట పాడుతున్న వాణిశ్రీ

పరకాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తన కంఠంతో వేలాది ప్రజల ముందు పాటలు పాడుతూ ప్రజల మెప్పు పొందాలని చిన్నతనం నుంచి ఒక లక్ష్యంగా ముందుకు అడుగులు వేస్తోంది పరకాల పట్టణానికి చెందిన వేమునూరి వాణిశ్రీ. చిన్నచిన్నగా పాఠశాల స్థాయి నుంచి పాటలు పాడుతూ నేడు ఉత్తమ సింగర్‌గా నేషనల్ అవార్డు అందుకోబోతోంది.

భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం జూకల్ గ్రామానికి చెందిన వేమునూరి లక్ష్మణాచారి - వనజ దంపతులకు ముగ్గురు కూతుళ్లు, వాణిశ్రీ, కల్యాణి, స్రవంతి, కుమారుడు నాగరాజు ఉన్నారు.


గాయని వాణిశ్రీ

వృత్తిరీత్యా వడ్రంగి కావడంతో గ్రామంలోని కార్పెంటర్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. వాణిశ్రీ డిగ్రీ వరకు చదివింది. శాయంపేట మండలం ప్రగతి సింగారానికి చెందిన వీరబ్రహ్మాచారితో 2002లో వాణిశ్రీకి వివాహం జరిపించారు. అప్పట్లో కొద్దో గొప్పో పాటలు పాడే వాణిశ్రీ.. భర్త సహకారంతో పరకాల పట్టణానికి చెందిన బండి సమ్మయ్య, కుమారస్వామి బృందంలో చేరి వివాహ, శుభ కార్యాలకు ఈవెంట్ చేసేందుకు వెళ్తుంది. ఇప్పటి వరకు సుమారు 2వేలకు పైగా పాటలు పాడింది. మొట్టమొదటగా అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని పరకాల పట్టణంలో 'నీ ధర్మం మరువొద్దు.. ఈ సంఘం మరవద్దు' అనే పాటను పాడి రూ.4,116 బహుమతి అందుకున్న వాణిశ్రీ.. అప్పటి నుంచి ఇప్పటి వరకు వెనుతిరగలేదు.

వృద్ధాశ్రమ ఏర్పాటుకు ప్రయత్నం

చేయూత ఫౌండేషన్ ద్వారా ఒక వృద్ధాశ్రమాన్ని నెలకొల్పి వృద్ధులకు చివరి దశలో మంచి జీవితాన్ని అందించాలనే లక్ష్యంగా వాణిశ్రీ అడుగులు వేస్తోంది. ప్రస్తుతం సామాజిక సేవల్లో పాల్గొంటుంది. సరైన సహకారం, ప్రోత్సాహం ఉన్నతాధికారులతో పాటు, ప్రభుత్వం అండదండలు అందిస్తే పరకాల పట్టణ ప్రాంతంలో వృద్ధాశ్రమాన్ని నెలకొల్పి అనాథ వృద్ధులకు సేవ చేస్తానని వాణిశ్రీ పేర్కొంటోంది.

జాతీయస్థాయి అవార్డుకు వాణిశ్రీ ఎంపిక

ఈ నెల 11న ఉత్తమ సింగర్‌గా నేషనల్ అవార్డు వాణిశ్రీ అందుకోనున్నారు. హైదరాబాద్‌లో మనం ఫౌండేషన్ అనే సంస్థ 9వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించే అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా ఉత్తమ సింగర్‌గా ప్రముఖుల చేతులమీదుగా వాణిశ్రీ అవార్డు స్వీకరించనున్నట్లు తెలిపారు.


డాక్టర్ హరికిషన్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు, వైద్యులు

ఆయుర్వేద ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా హరికిషన్

గిర్మాజీపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జె. హరికిషన్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన డాక్టర్ జి.పద్మావతి గురువారం ఉద్యోగ విరమణ చేయడంతో ఆమె స్థానంలో జె.హరికిషన్‌ను నియమిస్తూ తెలంగాణ ఆయుష్ డైరెక్టర్ పి.శ్రీకాంత్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.అశోక్ కుమార్, ఆయుర్వేద విభాగాల అధిపతులు డాక్టర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ దుర్గాబాయి, డాక్టర్ విజయగణేష్ రెడ్డితో పాటు అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వైద్యాధికారులు హరికిషన్‌కు అభినందనలు తెలిపారు.

ఒకవైపు కొరత.. మరోవైపు ప్యాకేజీ

- యూరియా కోసం రైతుల అగచాట్లు
- ఖరీదైన ఫెస్టిసైడ్లు కొనాలని డిమాండ్
- అన్నదాతలపై పెరుగుతున్న ఆర్థిక భారం



హనుమకొండ టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలో ఖరీఫ్ సాగు ముమ్మరంగా సాగుతున్న వేళ.. రైతులపై ఆర్థిక భారం పడుతోంది. జిల్లాలో 14 మండలాల్లో అన్నదాతలు పత్తి సాగుతో పాటు వరి నార్లు పోసుకుంటున్నారు. పత్తి, మొక్కజొన్న ఇతర కూరగాయల పంటలకు యూరియాను రైతులు ఎక్కువ ఉపయోగిస్తుంటారు. జిల్లాలో 20 రోజులుగా యూరియా కొరత ఏర్పడింది. రైతులు యూరియా కోసం వెళ్తే ఇతర ఖరీదైన ఎరువులు తీసుకోవాలని డీలర్లు, వ్యాపారులు ఒత్తిడి చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా వ్యవసాయ శాఖ అధికారులు మౌనం పాటిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మార్పీ కంటే ఎక్కువ

యూరియా ఎమ్మార్పీ రూ.266 లభించాల్సి ఉండగా రూ.350నుంచి రూ.400 వరకు అమ్మకాలు జరుపుతున్నారు. యూరియాతో పాటు ఇతర రసాయనాల ధరతో కలిపి చూస్తే రూ.600 నుంచి 700 వరకు ఒక బస్తాకు చెల్లించాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ డబ్బులు రైతుల వద్ద వసూలు చేస్తున్నారని, వాటికి యూరియాకు బిల్లులు ఇవ్వడం లేదని, ఇతర ఎరువులు కలిపి తక్కువ బిల్లులు ఇస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

అధికారుల మౌనం

ఎరువులు తీసుకుంటేనే యూరియా ఇస్తున్నారని సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులకు సమయానికి ఎమ్మార్పీ ధరకే యూరియాను అందించాలని, అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచి రైతులకు ఇబ్బందులు కలుగకుండా సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

యూరియా కొరత



హనుమకొండ జిల్లావ్యాప్తంగా పంటల సాగుకు యూరియా సరిపోవడం లేదని క్యూలో ఉన్న ఒక్కో రైతుకు రెండు బస్తాలు అందిస్తున్నారు. దీంతో కొంతమంది డీలర్లు, ఇతర రిటైల్ వ్యాపారులు యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలించి గోదాములలో నిల్వ చేస్తున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన యూరియా స్టాక్‌ను ప్రైవేటు డీలర్లు ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్‌సింగ్

జిల్లాలో యూరియా కొరత లేదు. కొంత మంది కావాలని కొరత ఉన్నట్లు ప్రచారం చేస్తున్నారు. రైతులు అవసరానికి మించి కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నారు. కిందటేడు కంటే ఈ యేడు ఇప్పటికే 800 మెట్రిక్ టన్నుల ఎక్కువ యూరియా అమ్మకాలు పెరిగాయి. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయించిన వారిపై చర్యలు తీసుకుంటాం.

కూరగాయల సాగు.. లాభాలు బహు బాగు

- రాయితీలు అందిస్తున్న ప్రభుత్వం
- సద్వినియోగించుకోవాలంటున్న ఉద్యాన శాఖ అధికారులు


రైతులకు బిందు సేద్యం కోసం అందించిన డ్రిప్ పరికరాలు

భీమదేవరపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా కూరగాయల సాగు విస్తీర్ణం పెంచేలా రైతులకు కూరగాయల సాగుకు వివిధ పథకాలతో రాయితీలు అందిస్తోంది. కూరగాయల సాగుకు ఇచ్చే రాయితీల గురించి హనుమకొండ ఉద్యాన శాఖాధికారి సుస్మిత వివరించారు.

కూరగాయల నారు

టమాటా, వంకాయ, పచ్చి మిర్చి నారు రైతులకు వంద శాతం రాయితీపై అందజేస్తారు. ఐదెకరాలలోపు ఉన్న ప్రతి రైతు కూరగాయల నారును ఉద్యాన శాఖ ద్వారా అందిస్తున్నారు. రైతులు తమకు అవసరం ఉన్న నారు వివరాలను 30 రోజుల ముందు తెలియజేస్తే వారికి వంద శాతం రాయితీతో కూరగాయల నారును అందిస్తామన్నారు. రైతులు ఇందు కోసం పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ పత్రాలతో ఉద్యాన శాఖాధికారులను సంప్రదించాలి.

శాశ్వత పందిళ్లు

కూరగాయాల్లో బీర, కాకర, మొదలైన తీగజాతి కూరగాయల సాగు కోసం ఉద్యాన శాఖ శాశ్వత పందిళ్ల నిర్మాణం కోసం రాయితీ ఇస్తుంది. 50 శాతం రాయితీలు ఇస్తున్నారు. ఒక యూనిట్‌కు 50వేల రాయితీతో పాటు రెండున్నర ఎకరాలు రైతుకు ఉండాలి.

మల్చింగ్ విధానం

కూరగాయల సాగులో ముఖ్యంగా కలుపుతీత రైతులకు ప్రధాన సమస్య. ఈ సమస్యను అధిగమించడానికి మల్చింగ్ విధానాన్ని ఉద్యాన శాఖ అందిస్తుంది. ఎరువుల యాజమాన్యం తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడి చేయడానికి మల్చింగ్ విధానం ఉపయోగపడుతుంది. ఎకరాకు రూ. 8వేల రాయితీని, ఐదెకరాల వరకు అందిస్తుంది. ఊతం విధానాల్లో టమాట, ఇతర కూరగాయాల పంటలు సాగు చేయడానికి రాయితీ సదుపాయం కల్పిస్తున్నారు. ఒక ఎకరానికి రూ. 10వేల చొప్పున ఈ రాయితీ ఇస్తున్నారు.

బిందు సేద్యం

తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండించేందుకు ఉద్యాన శాఖ ద్వారా బిందు సేద్యం పథకాన్ని రైతులకు అందిస్తున్నారు. బిందు సేద్యం ఇతరులకు 80శాతం, బీసీ, సన్నకారు, చిన్నకారు రైతులకు 90శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం రాయితీ అందిస్తున్నారు. అలాగే తుంపర్ల సేద్యం కోరుకునే రైతులు 75శాతం రాయితీ అన్ని కేటగిరీల రైతులకు అందజేస్తారు. బోర్, బావి నీటి వసతి ఉన్న రైతులు తుంపర్ల సేద్యంకు అర్హులన్నారు. రైతులు ఈ రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలన్నారు. అవసరం ఉన్న రైతులు ఉద్యాన శాఖాధికారులను సంప్రదించాలని కోరారు. సంబంధిత వివరాల కోసం 8977714068 హనుమకొండ ఉద్యాన శాఖాధికారి సుస్మితను సంప్రదించాలని కోరారు.


మల్చింగ్ పద్ధతిలో సాగు చేస్తున్న రైతు

హమాలీ.. కళల మాలి

తనకు చిన్నప్పటి నుంచి పాటలంటే ప్రాణం. గురువు బాబు వద్ద మెళకువలు నేర్చుకుని ప్రజానాట్యమండలి కళాకారుడిగా ప్రస్థానం మొదలుపెట్టాడు. నటుడిగా, ఉద్యమకారుడిగా, సామాజిక కార్యకర్తగా, నర్తకుడిగా, పాటలు పాడుతూ ఆటలు ఆడుతూ ప్రజలు, పలువురి ప్రశంసలందుకుంటున్నాడు. సొంతంగా పల్లె పాటలను అల్లుకుని వరకట్న దురాచారం, మద్యపానం, నిరక్షరాస్యతపై ప్రజలను చైతన్య పరుస్తున్నాడు. కళామతల్లికి సేవ చేస్తూనే తన పొట్ట కూటి కోసం కూలి పనులు చేస్తున్న ప్రజా కళాకారుడు, వాగ్గేయకారుడు అయిన దామెర కృష్ణ ప్రస్థానంపై ఈ ప్రత్యేక కథనం.

- గాయకుడిగా, కళాకారుడిగా తనదైన ముద్ర చాటుతున్న దామెర కృష్ణ
- ప్రజా నాట్యమండలి తరఫున చురుకైన పాత్ర
- సాంఘిక దురాచారాలపై ప్రజల్లో చైతన్యం
- కార్మిక సంఘం నాయకుడిగా సమస్యలపై పోరు



రవీంద్రభారతిలో గద్దర్ పురస్కారాన్ని డిప్యూటీ స్పీకర్ బండా ప్రకాష్ నుంచి అందుకుంటున్న దామెర కృష్ణ


కళాకారులతో కలిసి ప్రదర్శన ఇస్తున్న దామెర కృష్ణ

వరంగల్ సిటీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కళాకారుడిగా, ప్రజా నాయకుడిగా, వాగ్గేయకారుడిగా రాణిస్తున్న దామెర కృష్ణ వరంగల్ జిల్లా దామెర మండల కేంద్రానికి చెందిన దామెర కమలమ్మ, ఆగయ్య దంపతులకు రెండో సంతానంగా 1970లో జన్మించారు. తన చిన్నతనంలో తండ్రి మృతి చెందాడు. తల్లి కమలమ్మ అన్ని తానై కృష్ణను డిగ్రీ వరకు చదివించింది. తనకు పాటలపై ఉన్న మక్కువతో గురువు బాబు వద్ద జానపద కళల్లో మెళకువలు నేర్చుకున్నాడు.

కార్మికుడు.. నాయకుడిగా..

1996లో సీపీఐ ఆధ్వర్యంలో ఏర్పడిన ఎస్ఆర్‌నగర్ కాలనీకి మూడు సార్లు శాఖ కార్యదర్శిగా పనిచేశారు. సీపీఐ జిల్లా సమితి సభ్యుడిగా పని చేశారు. ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర సమితి సభ్యుడిగా పనిచేశారు. 2019లో ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో హమాలిగా చేరి హమాలి వర్కర్స్ యూనియన్‌ను స్థాపించడమే కాకుండా ప్రధాన కార్యదర్శిగా కార్మికుల హక్కుల కోసం ఉద్యమాలు చేశారు. ప్రస్తుతం ఏఐసీటీయూ జిల్లా సహాయ కార్యదర్శిగా పని చేస్తున్నారు.



కళాకారుడిగా..

సామాజిక రుగ్మతలపై తన గానామృతంలో ప్రజలను చైతన్య పరుస్తున్నారు. బుర్రకథ, హరికథలతో పాటు మద్యపానం, వరకట్నం, నిరక్షరాస్యత, పల్లెపాటలను అల్లుకుని వందలాది ప్రదర్శనలిచ్చారు. తెలంగాణ మలి ఉద్యమంలో తన ఆట పాటలతో ప్రజలను ఉర్రూతలూగించారు. గజ్జెకట్టి గళమెత్తి చలో ధూం..ధాం...అంటూ యువతను మేలుకొల్పారు. మిలియన్ మార్చ్, సకల జనుల సమ్మె, సాగర హారం వంటి కార్యక్రమాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. స్వరకర్తగా కళాబృందాన్ని నడిపించే నాయకుడిగా, నర్తకుడిగా, నటుడిగా ప్రజలను చైతన్య పరుస్తున్నారు.

అందుకున్న అవార్డులు.. ప్రశంసలు

2016లో జ్యోతిరత్న అవార్డును అందుకున్నారు. 2019లో ఎన్‌టీఆర్ లైఫ్ టైం అవార్డు, జాతీయ స్థాయి కళారత్న అవార్డు, కళా వాచస్పతి, జానపద కళారత్న అవార్డులను అందుకున్నారు. 2023లో విమలక్క చేతుల మీదుగా ఉత్తమ నంది అవార్డును సొంతం చేసుకున్నారు. 2024లో గాన కోకిల, 2025లో భారత్ విభూషణ్, గద్దర్ పురస్కారం అందుకున్నారు.

ఆపరేషన్ మస్కాన్‌తో బాల కార్మికులకు విముక్తి : ఎస్పీ

మహబూబాబాద్ క్రైం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ మస్కాన్‌తో జిల్లాలోని పలువురు బాల కార్మికులకు విముక్తి లభించిందని ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ అన్నారు. జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 11వ విడత ఆపరేషన్ ముస్కాన్‌లో 40 మంది బాల కార్మికులకు విముక్తి కల్పించినట్లు తెలిపారు. దీనిలో తెలంగాణ నుంచి 23 మంది బాల, బాలికలు, ఇతర రాష్ట్రాల నుంచి 13 మందిని గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించామన్నారు. వీరిలో పశ్చిమ బెంగాల్ నుంచి ఒకరు, మధ్యప్రదేశ్ నుంచి ఇద్దరు, రాజస్తాన్ నుంచి ఐదుగురు, ఛత్తీస్‌గఢ్ నుంచి ఇద్దరు, బీహార్ నుంచి ఇద్దరు, మహారాష్ట్ర నుంచి ఇద్దరు చొప్పున 13 మంది చొప్పున బాల, బాలికలను గుర్తించి పునరావాస కేంద్రాలకు పంపించామన్నారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా బాలకార్మికులను పనిలో పెట్టుకున్న 20 మంది జయమానులపై కేసు నమోదు చేశామన్నారు. బాల కార్మిక వ్యవస్థ రూపుమాపేందుకు పకడ్బంది చర్యలు తీసుకుంటున్నామన్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్నట్లు తెలిస్తే 100కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఆపరేషన్‌ముస్కాలో బాలకార్మికులకు విముక్తి కల్పించిన అధికారులను అభినందించారు.

వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మహాలక్ష్మి అభిషేకం

కేసముద్రం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మునిసిపాలిటీ పరిధిలోని అమినాపురం వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా శ్రీమహాలక్ష్మి అమ్మవారికి అభిషేకం, శ్రీహోమం, కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వినయ్ మిశ్రా, హేమంతాచార్యుల ఆధ్వర్యంలో పూజలు కొనసాగాయి. ఈ కార్యక్రమాలకు అతిథిగా మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, ఇనుగుర్తి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కూరెల్లి సతీష్ హాజరు కాగా ఆలయ కమిటీ అధ్యక్షుడు వేలం, బచ్చు పరమేశ్వర్, కొయగూరి యాకూబ్‌రెడ్డి, అంబటి మహేందర్‌రెడ్డి, బాణాల నాగరాజు, శ్రీరాం సంతోష్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● అధికారులు సమన్వయంతో పని చేయాలి

● మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్ సూచించారు. శుక్రవారం మహబూబాబాద్ మునిసిపల్ 17వ వార్డు పరిధిలోని రామన్నపేటకాలనీ, జగ్జీవన్ రామ్‌కాలనీల్లో స్థానిక ఆయన పర్యటించారు. మునిసిపల్, ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులతో కలిసి ఆయా కాలనీల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలను పలకరిస్తూ సమస్యలను తెలుసుకుంటూ వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ఆయా కాలనీవాసులు డ్రైనేజీ, విద్యుత్, పాఠశాలకు పక్కా భవనం ఇతరత్రా సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మానుకోట పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నదే తమ ధ్యేయమని తెలిపారు. మునిసిపల్ కమిషనర్ టి.రాజేశ్వర్, కాంగ్రెస్ నాయకులు ఎడ్ల రమేష్, ఖలీల్‌పాష, బోనగిరి గిరిధర్‌గుప్తా, నిమ్మల శ్రీనివాస్, గుగులోతు వెంకట్‌నాయక్, మేకల శ్రీనివాస్, సప్పిడి రంజిత్, శంకర్ పాల్గొన్నారు.



మహబూబాబాద్ రామన్నపేట కాలనీలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్

ముత్యాలమ్మ బోనాల పండుగకు ఆహ్వానం..

మహబూబాబాద్ పట్టణంలో ఈనెల 3వ తేదీ నుంచి 23 వరకు నిర్వహించే గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి బోనాల ఉత్సవాలకు రావాలని ముత్యాలమ్మ ఆలయ కుమ్మరి పూజారులు బొడ్డుపల్లి ఉపేందర్, నర్స య్య, బొడ్డుపల్లి ఉపేంద్రం, కవిత, వరలక్ష్మి, పద్మ, భద్రమ్మ, ఉష, భూలక్ష్మి, మునీత కోరారు. మహబూబాబాద్‌లో ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్‌కు ఆహ్వాన పత్రికను అందించారు. బోనాల ఉత్సవాలకు కుటుంబ సమేతంగా హాజరై ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులు పొందాలని విజ్ఞప్తి చేశారు.

ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

● జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఎరువుల వాడకాన్ని తగ్గించి, సహజ వ్యవసాయాన్ని అవలంబించాల్సిన అవసరం ఉందని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల అన్నారు. మహబూబాబాద్ మండలం మల్యాలలోని జేవీఆర్ ఉద్యాన పరిశోధన స్థానం ఆధ్వర్యంలో శుక్రవారం షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక ఆర్థిక సౌజన్యంతో ఉద్యాన పంటల సాగుపై పండ్ల మొక్కల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు వేదికల్లో ప్రసారమవుతున్న శాస్త్రవేత్తల సలహాలు పాటించి, అధిక దిగుబడి సాధించుకోవాలన్నారు. జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి జినుగు మరియన్న మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వ ఇస్తున్న రాయితీలను ఉపయోగించుకోవాలన్నారు. జేవీఆర్ ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త, అధిపతి కత్తుల నాగరాజు మాట్లాడుతూ కొత్త మామిడి తోటల ఏర్పాటు సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలం సాగుకు అనువైన అధిక దిగుబడినిచ్చే కూరగాయాలను సాగు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ క్రాంతికుమార్, శాస్త్రవేత్తలు ప్రశాంత్, సుహాసిని, పరమేశ్వర్, అశోక్, హెచ్‌ఆర్‌ఎస్, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. అనంతరం శిక్షణకు హాజరైన రైతులందరికి మామిడి మొక్కలు పంపిణీ చేశారు.



పండ్ల మొక్కలు పంపిణీ చేస్తున్న విజయనిర్మల, వ్యవసాయాధికారులు

ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ (తాడు) జిల్లా గౌరవ అధ్యక్షుడు యాళ్ల మురళీధర్ రెడ్డి అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో తాడు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ ఆటో డ్రైవర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఆటో డ్రైవర్లకు నెలకు రూ.12 వేలు అందించాలన్నారు. ఆటోలు నడవక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఎవరు ఆత్మహత్యలకు పాల్పడ వద్దని మనోధైర్యంతో ప్రభుత్వంతో కొట్లాడి హక్కులను సాధించుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆత్మహత్యలు చేసుకున్న ఒక్కొఆటో డ్రైవర్ కుటుంబానికి రూ. 25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నలమాస సాయి, మల్లేష్, చెక్కల అశోక్, యాకూబ్‌పాషా, జినక సైదులు, సతీష్, రాందాస్, సంతోష్, కిరణ్, నరేష్, పవన్, కార్తీక్, రమేష్, సాగర్, శ్రీరామ్, అనిల్, వినోద్, రవి, రాజేష్, శ్రీకాంత్, శ్రీనివాస్, నాగార్జున పాల్గొన్నారు.

నేడు బయ్యారంలో సాగు న్యాయ యాత్ర

బయ్యారం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : రైతు హక్కుల కోసం చట్టాలను రైతులకు చుట్టాలుగా చేయటమే లక్ష్యంగా రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు, ల్యాండ్‌అండ్‌అగ్రికల్చర్ అడ్వకేట్ ఎం. సునిల్ శనివారం బయ్యారంలో పర్యటించనున్నట్లు తహసీల్దార్ నాగరాజు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా పాతలింగాల నుంచి ప్రారంభమైయ్యే ఈ యాత్ర కామేపల్లి, కారేపల్లి, మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం మీదిగా బయ్యారం మండలానికి చేరుకోనున్నట్లు తహసీల్దార్ వెల్లడించారు. బయ్యారంలోని రైతు వేదికలో వ్యవసాయ అధికారులు, రైతులతో సమస్యలపై సమీక్షించనున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్లు మత్తు పదార్థాల జోలికి వద్దు : సీఐ

డోర్నకల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్లు విధి నిర్వహణలో ఉన్నప్పుడు మత్తుపదార్థాలు సేవించవద్దని డోర్నకల్ సీఐ రాజేష్ అన్నారు. డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలో శుక్రవారం ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. ఆటో డ్రైవర్లు లైసెన్స్ కలిగి ఉండాలని, ఆటోలకు ఇన్సూరెన్స్‌ను క్రమం తప్పకుండా చేయించాలన్నారు. ఆటోలో ప్రయాణించే ప్రయాణికుల పట్ల బాధ్యతగా నడుచుకోవాలన్నారు. సురక్షిత ప్రయాణానికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఎస్సైలు గడ్డం ఉమ, వంశీధర్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

బీజేపీకి పెరుగుతున్న ఆదరణ

డోర్నకల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో కేంద్రంలో ఏర్పడ్డ బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనుల పట్ల ప్రజల్లో మంచి ఆదరణ కన్పిస్తుందని, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు లకన్‌వ్యాస్ అన్నారు. శుక్రవారం డోర్నకల్ బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ పార్టీ పటిష్టతకు ప్రతీ కార్యకర్త కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మరో మూడేళ్లలో జరిగే ఎన్నికల నాటికి పార్టీ పటిష్టస్థితికి చేరుకుని అధికారం చేపట్టడం ఖాయమని ధీమావ్యక్తం చేశారు. ఇటీవల పార్టీలో చేరిన దారావత్ నరేష్‌ను పరిచయం చేశారు. బాసాని నాగేష్, రెహమాన్ పాల్గొన్నారు.

'గార్ల రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి పర్చాలి'

గార్ల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీ ప్రాంతమైన గార్ల మండల కేంద్రంలో రైల్వేస్టేషన్‌లోని మౌళిక సమస్యలతో పాటు పలు రైళ్లను నిలుపుదలకు కృషి చేయాలని కోరుతూ గార్ల రైల్వే స్టేషన్‌కు శుక్రవారం విచ్చేసిన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ గోపాల కృష్ణకు అఖిల పక్ష నాయకులు, మండల ప్రజలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజనల్ పరిధిలోని ఆదాయ వనరులు కలిగిన ప్రతీ రైల్వేస్టేన్‌ను అభివృద్ధి పర్చేందుకు బోర్డు ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. ప్రణాళిక బద్ధంగా వరస క్రమంలో అభివృద్ధి పర్చుతామని ఆయన హామీ ఇవ్వడం జరిగింది. ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలకు జీఎం దృష్టికి తీసుకపోతానన్నారు. ఈ కార్యక్రమంలో డీడీఆర్‌సీ మెంబర్ ఖాదర్ బాబా, రైల్వే బోర్డు మెంబర్ జర్పుల లచ్చిరాంనాయక్, అఖిల పక్ష నాయకులు కట్టెబోయిన శ్రీనివాస్, గుండా వెంకట్‌రెడ్డి, కందునూరి శ్రీనివాస్, మనుజ్‌కుమార్, వీరస్వామి, యాకుబ్ పాషా, నాగరాజు పాల్గొన్నారు.

టీఎస్ ఈజీసీ డైరెక్టర్‌గా చల్లా నారాయణరెడ్డి



కొత్తగూడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖలో తెలంగాణ రాష్ట్ర ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ కౌన్సిల్ డైరెక్టర్‌గా మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన చల్లా నారాయణరెడ్డి పదవి చేపట్టారు. ఈమేరకు కోనాపురంలో శుక్రవారం పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క నియామక పత్రాన్ని నారాయణరెడ్డికి అందజేశారు. తనకు పదవి ఇచ్చినందుకు నారాయణరెడ్డి మంత్రి సీతక్కను శాలువతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

వీరభద్రుడి సన్నిధిలో.. అర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూజలు

కురవి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : కురవి శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో అర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రకాళి సమేత వీరభద్రస్వామిని దర్శించుకోవడం తమ అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తల్లాడ వెంకటరాములు, వేమిశెట్టి కిశోర్, సకినాల భద్రయ్య పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

(5వ పేజీ తరువాయి)

సీతక్క మాట్లాడుతూ గత పదేళ్లుగా పేదలు రేషన్‌కార్డుల కోసం, ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూశారని పేర్కొన్నారు. గ్రామాలలో సీసీ రోడ్లుకు, బ్రిడ్జీల నిర్మాణాలకు అధిక మొత్తంలో నిధులు మంజూరు చేశామని పేర్కొన్నారు. కొత్తగూడలో 30 పడకల ఆస్పత్రిని మంజూరు చేశామని పేర్కొన్నారు. కొత్తగూడలో డిగ్రీ కళాశాల మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. దుబ్బగూడెం రోడ్డు పనులు మొదలయ్యేలా చర్యలు తీసుకుంటున్నానని పేర్కొన్నారు. రెండు మండలాలకు రెండు పంటలకు సాగునీరు, తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నానని పేర్కొన్నారు. కొత్తగూడ, గంగారం మండలాలోని అన్నిరకాల సమస్యలను పరిష్కరిస్తానని హమీఇచ్చారు. ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, తహసిల్దార్ రాజు, ఎంపీడీవో రోజారాణి, డీటీ పద్మావతి, ఆర్ఐ పరమేశ్వర్ పాల్గొన్నారు.

నాడు భయపెట్టి పార్టీలో చేర్చుకున్నారు..

నాడు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఇతర పార్టీల ఎమ్మెల్యేలను కేసులు పెడుతామని భయపెట్టి, బీఆర్‌ఎస్ పార్టీలో చేర్చుకున్నారు. నేడు కాంగ్రెస్ పార్టీలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే చేరితే భయపడుతున్నారని ఎద్దేవాచేశారు. మండలంలోని గుంజేడులో విలేకరులతో మంత్రి సీతక్క మాట్లాడుతూ నాడు లేని కోర్టులు, చట్టాలు నేడు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం స్పీకర్ నిర్ణయం మేరకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. కాగా ఓటాయిలో కాంగ్రెస్ పార్టీ జెండాను మంత్రి సీతక్క ఆవిష్కరించారు. బీఆర్‌ఎస్ నుంచి పలువురు మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వరినాటు కూలీలతో సరదాగా గడిపారు, ఓటాయిలో మహిళలలో కలసి నృత్యాలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, రూరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చల్లా నారాయణ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిలి, డీసీసీ జనరల్ సెక్రటరీ బానోత్ రూప్ సింగ్, డీసీసీ సభ్యుడు వీరనేని వెంకటేశ్వరరావు, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కర్ర జనార్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ విజయ, మాజీ జడ్పీటీసీ పుల్సం పుష్పలత, మండల అధికార ప్రతినిధి ఇర్ప రాజేశ్వర్, కాడబోయిన జంపయ్య, పెండ్యాల సారంగపాణి, నాయకులు పాల్గొన్నారు.

శ్యామ్ పాటకు పట్టం

'బలగం' సినిమాలోని 'ఊరూ.. పల్లెటూరు..' పాటకు పురస్కారం

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): 2023 సంవత్సరానికి గాను జాతీయస్థాయిలో ప్రకటించిన సినీ అవార్డుల జాబితాలో ఓరుగల్లు పాట పట్టం కట్టించుకుంది. హనుమకొండకు చెందిన సినీ గేయరచయిత కాసర్ల శ్యామ్ బలగం సినిమా కోసం రాసిన 'ఊరూ.. పల్లెటూరు' పాటకు జాతీయస్థాయిలో అవార్డును ప్రకటించడం విశేషం. వేణు దర్శకత్వంలో విడుదలైన బలగం సినిమాలో అన్ని పాటలు కాసర్ల శ్యామ్ రాయడం విశేషం. దాదాపు అన్ని పాటలు ప్రజాదరణ పొందాయి. బీమ్స్ సంగీతం వహించగా కాసర్ల శ్యామ్ రాసిన 'ఊరూ.. పల్లెటూరు..' పాట జాతీయస్థాయిలో తెలుగు విభాగంలో ఉత్తమ గేయంగా నిలిచింది.

శ్యామ్ ప్రస్థానం

2003లో బి.జయ దర్శకత్వంలో రూపొందించిన చంటిగాడు సినిమాలో కొక్కొరకో పాటతో పరిశ్రమలో గేయ రచయితగా అడుగుపెట్టిన శ్యామ్.. రెండు దశాబ్దాల తరువాత జాతీయస్థాయిలో తన ప్రతిభను నిరూపించుకోవడం విశేషం. వంద సినిమాల్లో ఇప్పటి వరకు సుమారు 280కి పైగా పాటలు రాశారు. శ్రీకాంత్ హీరోగా 2009లో విడుదలైన మహాత్మా సినిమాలో శ్యామ్ రాసిన 'నీలపూరి గాజుల ఓ నీలవేణి' పాట మొదలు.. 2020లో అలా వైకుంఠపురం సినిమాలో 'రాములో రాములా..' పాటకు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. అదే విధంగా 2022లో డీజే టిల్లు, 2023లో దసరా సినిమాలో 'చమ్కీలా అంగిలేసి' పాట ప్రేక్షక ఆదరణ పొందాయి. కృష్ణవంశీ, రాంగోపాల్‌వర్మ మొదలు అనేక మంది ప్రసిద్ధ దర్శకుల సినిమాల్లోనూ ఆయనకు అవకాశాలు వెతుక్కుంటూ వచ్చాయి.



ఇటీవల వరంగల్‌లో కాసర్ల శ్యామ్‌ను సత్కరిస్తున్న చిన్ననాటి మిత్రుల

హనుమకొండ బ్రాహ్మణవాడలో ప్రముఖ రంగస్థల నటుడుగా పేరొందిన మధుసూదన్‌రావు, మాధవి దంపతులకు జన్మించిన శ్యామ్ వరంగల్‌లో శంకర్, సారంగపాణి బృందంలో అనేక కార్యక్రమాలతోపాటు వినాయకచవితి వేడుకల్లో తన పాటలతో నగరవాసులను అలరింపజేశారు. చిన్నప్పటి నుంచే సాహిత్యంపట్ల అభిలాష ఉన్న శ్యామ్.. సినిమాల్లోకి రాకముందు 50 ఆల్బమ్స్ రూపొందించాడు. అందులో కాలేజీ పిల్లచూడరో.. యమ ఖతర్‌నాక్ ఉందిరో.. అన్న ఓ జానపద ఆల్బం ఆ రోజుల్లోనే పెద్ద హిట్ అయ్యి శ్యామ్‌ను పరిశ్రమ వైపు దృష్టి మళ్లించేలా చేసింది. కిందటేడు సారంగి ఫిల్మ్ అవార్డుతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు, అనేక అవార్డులతో శ్యామ్‌ను సత్కరించాయి.

ఓరుగల్లు మట్టి పరిమళమే..

ఓరుగల్లు మట్టి పరిమళమే తన పాట సాహిత్యానికి పునాది అని కాసర్ల శ్యామ్ 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. తాను రాసిన పాటకు జాతీయ అవార్డు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. తనకు సాహిత్యంలో, సంగీతంలో ఓనమాలు నేర్పిన శంకరన్న, సారంగపాణిల సహచర్యం సాహిత్య అభిలాష సినీ గేయరచయితగా తనకో స్థానం కల్పించాయని చెప్పారు.

ఆరోగ్య మిత్ర రజతోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ

మరిపెడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య మిత్ర రజతోత్సవాల పోస్టర్లను శుక్రవారం డిప్యూటీ స్పీకర్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ హైదరాబాద్‌లోని ఆయన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంచంద్రునాయక్ ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను కొనియాడారు. డాక్టర్ పరికిపండ్ల అశోక్ నిరంతర ప్రజాసేవకుడని, ఆరోగ్య మిత్ర ద్వారా చేపట్టిన పలు సేవలను ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో సామాజికవేత్తలు మధుకర్, వెంకట్రావు, సుబ్బారెడ్డి, మరిపెడ మాజీ సర్పంచ్ రాంలాల్, చిన్నగూడూరు మాజీ జడ్పీటీసీ భర్త మూల మురళీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ వేదిక కమిటీ ఎన్నిక

నర్సింహులపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక ముస్లిం మండల కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఫౌండర్, జాతీయ అధ్యక్షుడు సయ్యద్ సాదిక్ ఆలీ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడిగా ఎమ్డీ.మైనుద్దీన్, ఉపాధ్యక్షుడిగా ఎమ్డీ.మున్వర్, కార్యదర్శిగా ఎమ్డీ. అమీర్‌పాషా, కోశాధికారిగా హసీన, గౌరవ సలహాదారులుగా నయాయుద్దీన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మసీద్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ముస్లింలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ రమేశ్‌బాబుకు తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఖాజామీయా, మహబుబ్‌ఖాన్, ఇసాకుద్దీన్, మైపాషా, మస్తాన్, సదిల్, సర్వర్‌పాషా, అంజద్, షఫీ, మహబుబ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డు పేదల ఆత్మగౌరవ ప్రతీక

చిన్నగూడూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : రేషన్‌కార్డు కేవలం సరుకులు అందించే పత్రం మాత్రమే కాదని, పేదల ఆత్మగౌరవ ప్రతీక అని డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్, కాంగ్రెస్ నాయకుడు మూల మురళీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఉగ్గంపల్లిలో గ్రామ కార్యదర్శి అధ్యక్షతన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు హాజరై లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యాకన్న, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజు, వెంకట్య, మేగ్యానాయక్, బిక్కునాయక్, పట్ల కిరణ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రమేశ్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మాల మహానాడు కార్యకర్తల నిరసన

నెల్లికుదురు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ అమలు పట్ల సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో తెలంగాణ మాలమహానాడు కార్యకర్తలు నల్లబ్యాడ్జీలతో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. మండల అధ్యక్షుడు కారం ప్రశాంత్, దాసరి యాకయ్య, మాదరి ప్రశాంత్, బానాల సంజీవ, బోడ్డు రమేష్, మయ్య రాంబాబు, పత్తి దర్గయ్య, మయ్య వెంకన్న, వధు, బాలకృష్ణ, పాల్గొన్నారు.

హార్టికల్చర్ కళాశాలను నిర్మించాలి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో మల్యాలకు మంజూరు అయిన హార్టికల్చర్ కళాశాలను ఆ గ్రామంలోనే నిర్మించాలని బీఆర్‌ఎస్ మండల నాయకులు ఆవుల వెంకన్న అన్నారు. మహబూబాబాద్ మండలం మల్యాలలో బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో గుగులోతు వీరన్న, బానోత్ దాము, రమేష్ పాల్గొన్నారు.

అమరులను స్మరిస్తూ పోరాటాలు

● కేజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : కల్లు గీత కార్మికుల హక్కుల కోసం పోరాడి అసువులు బాసిన వారి స్ఫూర్తితో గీత కార్మికుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించాలని కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో ఆగస్టు 2 నుంచి 18 వరకు సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహించే అమరుల యాదిలో సామాజిక చైతన్య యాత్రల వాల్ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... డోర్నకల్ మండలం గొల్లచర్లలో ఈ నెల 2న ప్రారంభమై 18న జిల్లా కేంద్రంలో ముగుస్తుందని చెప్పారు. కల్లుగీత కార్మికులను సంఘటితం చేసేందుకు 1957లో సంఘం స్థాపించబడిందని, అనేక పోరాటాల ద్వారా గీత కార్మికుల ఎక్స్‌గ్రేషియో, పెన్షన్ తదితర హక్కులను సాధించుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపా జిల్లా నాయకులు సమ్మెట వెంకన్న, సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యమగాని వెంకన్న, గౌని వెంకన్న,గునిగంటి రాజన్న, వెంకటేశ్వర్లు, యాకన్న, మండ విక్రమ్, లింగయ్య, రాములు, అంతయ్య, అంజయ్య, రామన్న, రవి, చిన్నసైదులు పాల్గొన్నారు.

మునిసిపల్ ఎన్నికలకు కసరత్తు

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వంలో కదలిక వచ్చింది. ఈ నేపథ్యంలో పురపాలిక ఎన్నికలు వీలైనంత త్వరగా నిర్వహించాలనే నిర్ణయానికి వచ్చింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 12 పురపాలక సంఘాలు ఉన్నాయి. వీటిలో మూడు ఇటీవల కొత్తగా ఏర్పాటయ్యాయి. పాత వాటితో పాటు కొత్త వాటికి కూడా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించనున్నది.

పాత, కొత్తవి కలుపుకొని..

ఉమ్మడి జిల్లాలో 12 పురపాలక సంఘాలు ఉన్నాయి. నర్సంపేట, పరకాల, జనగామ, మహబూబాబాద్, తొర్రూరు, మరిపెడ, వర్ధన్నపేట, భూపాలపల్లి, డోర్నకల్ పాతవి. ములుగు, కేసముద్రం, స్టేషన్ ఘనపూర్ ఇటీవల కొత్తగా ఏర్పాటయ్యాయి. పాతవాటితో పాటు కొత్తవాటికి కూడా ఎన్నికలు నిర్వహించనున్నారు. చుట్టుపక్కల ఉన్న గ్రామ పంచాయతీలను విలీనం చేయడం ద్వారా కొత్త మున్సిపాలిటీలను ఏర్పాటు చేశారు. నర్సంపేట మున్సిపాలిటీలో కూడా కొన్ని గ్రామాలు విలీనం అయ్యాయి. ప్రభుత్వం ఇటీవల ఉమ్మడి జిల్లాలో నాలుగు కొత్త మండలాలు కేజే మల్లంపల్లి, ఇనుగుర్తి, సీరోలు, గోరికొత్తపల్లిలను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో కొన్ని గ్రామ పంచాయతీలను విలీనం చేయడం ద్వారా మూడు కొత్త మున్సిపాలిలను ఏర్పాటు చేసింది. మండలాలు, పంచాయతీలు, మున్సిపాలిటీ పునఃవ్యవస్థీకరణ ప్రక్రియ పూర్తయినందు వల్ల స్థానిక సంస్థలతో పాటు మున్సిపల్ ఎన్నికలకు మార్గం సుగమం అయింది.

ఏర్పాట్లు

పురపాలక సంఘాల ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతున్న అధికారులు.. మొదట ఓటర్ల తాజా జాబితాలపై దృష్టిసారించారు. 2020 జనవరిలో ఎన్నికలు జరిగాయి. అయిదేళ్లలో పురపాలికల్లో జనాభా, గృహాల సంఖ్య పెరిగింది. కొన్ని విస్తరించాయి. ఆ మేరకు ఓటర్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. దీనితో ఓటర్ల జాబితాలను సిద్ధం చేస్తున్నారు. కొత్తగా ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలి. రిజర్వేషన్ల ప్రక్రియ కూడా జరగాలి.

వార్డుల పునర్విభజన

కొత్తగా ఏర్పడ్డ మున్సిపాలిటీల్లో వార్డుల ఖరారుపై మున్సిపల్ శాఖ అధికారి ఇటీవల జీవో జారీ చేశారు. ఈ మేరకు మున్సిపల్ అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేశారు. వార్డుల విభజనకు సంబంధించి నోటిఫికేషన్ జూన్‌లోనే నోటిఫికేషన్ జారీ అయింది. జూన్ 21 వరకు వార్డుల విభజన ప్రక్రియ పూర్తిచేసేలా అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఇప్పటికే గ్రామాలు, పంచాయతీ వార్డుల విభజన, ఓటరు జాబితాలను తయారు చేసింది. ఎంపీటీసీల విభజన, ఓటరు జాబితాను సిద్ధం చేసి ఎన్నికలకు సిద్ధమవుతోంది. త్వరలో ఎన్నికలకు అవసరమైన రిజర్వేషన్లను ఖరారు చేయనున్నది. ఈ నేపథ్యంలో పట్టణాల్లోనూ వార్డుల విభజన చేపట్టడంతో ఆ తర్వాత ఓటరు జాబితా పూర్తికానున్నది.

అమృత్ భారత్ పనులను పూర్తి చేయండి

(5వ పేజీ తరువాయి)

చేపట్టాలని, కోర్టు వైపు స్టేషన్ ముఖ ద్వారాన్ని నిర్మించాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రాన్ని డీఆర్‌ఎంకు అందజేశారు. తొలుత డీఆర్‌ఎం గోపాలకృష్ణన్ మహబూబాబాద్ రైల్వేస్టేషన్లోని ఒకటి, రెండు, మూడో ప్లాట్‌ఫాంలో జరుగుతున్న నిర్మాణ పనులతో పాటు ఎక్స్‌టెన్షన్ ఎక్స్‌కవేటర్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, మూడో లైను పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో మహబూబాబాద్, డోర్నకల్ రైల్వే స్టేషన్ల బాధ్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిక్ వ్యాగన్‌షెడ్డును సందర్శించిన డీఆర్‌ఎం

డోర్నకల్ : డోర్నకల్ రైల్వే జంక్షన్‌లో శుక్రవారం దక్షిణ మధ్య డీఆర్‌ఎం గోపాలకృష్ణన్ పర్యటించారు. ప్రత్యేక రైలులో వచ్చిన డీఆర్‌ఎం తొలుత రైల్వే సిక్ వ్యాగన్ షెడ్డును సందర్శించారు. రోడ్డు నెంబర్-9లో వసతులు, లైటింగ్ సౌకర్యం కల్పించాలని, డోర్నకల్‌లో రన్నింగ్‌స్టాఫ్‌కు అవసరమైన రైల్వే క్వార్టర్స్‌ను నిర్మించాలని సంఘ్ నాయకులు బషీర్‌ఆలీ డీఆర్‌ఎంకు వినతిపత్రం అందించారు.